రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామ పరిధిలోని నిర్మాణ స్థలం



సర్వే నెంబర్ 27లోని స్థలాన్ని ప్రభుత్వ భూమిగా చూపుతున్న ధరణి పోర్టల్

వంశీరాం.. హైడ్రా.. అనిరుధ్.. పెద్దల ప్లానింగే!

- సంచలనంగా మారిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపణలు
- మూడేండ్ల కిందటే 27.18 ఎకరాల ప్రభుత్వ భూమికి స్కెచ్
- ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్న అప్పటి కేసీఆర్ ప్రభుత్వం
- కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే మళ్లీ పాత ప్లాన్ అమలుకు పావులు
- ముఖ్యనేత సూచనతో రంగంలోకి దిగి చక్కబెట్టిన ఓ మంత్రి
- ప్రాజెక్టులో 2.5 లక్షల చదరపు అడుగుల డీల్‌తో రూట్ క్లియర్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/శేరిలింగంపల్లి, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ హైదరాబాద్ వెస్ట్ సిటీలో అత్యంత విలువైన ప్రాంతం. ఆ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 27లో సుమారు 64.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. 1954-55 ఖాస్రా పహాణీతోపాటు 1959-60 సంవత్సరపు రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకుగా పేర్కొని ఉన్నది. 2018లో ధరణిలోనూ ఇదేవిధంగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ భూమిని 22(ఏ) కింద నిషేధిత జాబితాలో పెట్టారు. 1954-55 ఖాస్రా పహాణీతోపాటు తదుపరి రికార్డుల్లోనూ ఇది పోరంబోకుగానే ఉన్నది. అయితే ఇందులో 27.18 ఎకరాల భూమి తమదంటూ వారసుల పేరిట ఆరుగురు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. 1960 వరకు ఈ భూముల రికార్డులు తమ పూర్వీకుల పేరిటనే ఉంటూ వచ్చాయని, 1961లో మాత్రం రికార్డుల్లో పోరంబోకుగా మారిందని వారు కోర్టుకు విన్నవించారు. వీరి విన్నపాన్ని పరిశీలించాలని 1986లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తమ పేరిట భూ రికార్డులను మార్చాలన్న వారసుల విజ్ఞప్తిని 1991లో జాయింట్ కలెక్టర్ తిరస్కరించారు. దీనిపై వారు తిరిగి ల్యాండ్ అండ్ సర్వే రికార్డుల కమిషనర్‌కు అప్పీల్ చేసుకున్నారు. 1995లో అప్పటి డీఆర్వో ఆదేశానుసారం (డి1/6770/93) రికార్డులు తమ పేరిట మార్పిడి జరిగాయని పేర్కొంటూ వారసులు ఆ భూమిని 1995లో ఐదుగురికి విక్రయించారు. కొనుగోలు చేసిన ఐదుగురు వ్యక్తులు ఆ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించారు. ఈ విక్రయాలు 2001 నుంచి ప్రారంభమై కొన్నేండ్లపాటు కొనసాగాయి. తర్వాత కూడా వివాదం న్యాయస్థానంలో కొనసాగినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ప్లాట్ల యజమానులంతా కలిసి ‘బేవర్లీ హిల్స్ సంక్షేమ సంఘం’గా ఏర్పడ్డారు. 2019లో ప్లాట్ల యాజమానులు, బేవర్లీ హిల్స్ సంక్షేమ సంఘంతో సోహిని ఎల్ఎల్‌పీ బిల్డర్స్ ‘డెవలప్‌మెంటు కమ్ జీపీఏ’ ఒప్పందం చేసుకున్నది. ఈ ఎల్ఎల్‌పీలో వంశీరాం సహా పలు సంస్థలు ఉన్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి.

గుట్టుచప్పుడు కాకుండా ప్రొసీడింగ్స్ జారీ

ఈ వివాదాస్పద భూములు 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రభుత్వ స్వాధీనంలోనే ఉన్నాయి. ప్లాట్ల యజమానులుగానీ, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నవారుగానీ భూమి మీదకు వెళ్లలేదు. ధరణిలోనూ ఈ భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగాయి. పట్టాదారు పేర్లు ఉన్నప్పటికీ ఇవి కోర్టు వివాదాల్లో ఉన్నాయని ధరణి పోర్టల్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ క్రమంలో 2022లో అప్పటి రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు గుట్టుచప్పుడు కాకుండా 27.18 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ (డీనోటిఫై) ఉత్తర్వులు (ఈ1/2970/2022) ఇచ్చారు. దీనిని ఆసరాగా చేసుకొని 2022లోనే గృహ నిర్మాణ ప్రాజెక్టు కింద జీహెచ్ఎంసీకి దరఖాస్తు చేసుకోగా... 2023, మార్చిలో అనుమతి మంజూరైంది. అనంతరం కూడా సదరు నిర్మాణ సంస్థ భూమి మీదకు పూర్తిగా వెళ్లలేదు. చిన్నపాటి రేకులషెడ్డు వేయడం ప్రారంభించింది.

రూ.250-300 కోట్లకు అమాత్యుడి డీల్?

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమ ఆటలు సాగకపోవడంతో మిన్నకుండిపోయిన సదరు నిర్మాణ సంస్థ.. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ భూములు చెరపట్టే పని మొదలుపెట్టింది. సర్కారు భూమిని తిరిగి వశం చేసుకుని, ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు పావులు కదిపింది. ఇందులోభాగంగా వివిధ మార్గాలను అన్వేషించి.. ఎట్టకేలకు ‘ముఖ్య’ నేత కోటరీ చెంతకు చేరుకున్నారు. గతంలో జరిగినదంతా వివరించి.. ఇప్పుడు ఆ భూమిని తమకిచ్చి నిర్మాణ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సహకరించాలని వారు కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దాంతో సదరు ముఖ్యనేత ఈ వ్యవహారాన్ని ‘డీల్’ చేయాల్సిందిగా ఓ అమాత్యుడికి అప్పగించినట్టు సమాచారం. ఇంకేముంది... ముఖ్యనేతనే గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆ అమాత్యుడు రెచ్చిపోయాడు. ఆ భూమిని ఇప్పించి ప్రాజెక్టును పూర్తిచేసేందుకు తాను మార్గం సుగమం చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సదరు నిర్మాణ సంస్థతో ఆయన బిగ్ డీల్ చేసుకున్నట్టు తెలిసింది. ప్రతిపాదిత ప్రాజెక్టులో సదరు సంస్థ 49 అంతస్తుల చొప్పున ఏడు టవర్లు నిర్మించాలని ప్రణాళికలు రచించింది. ఈ నిర్మాణ విస్తీర్ణం సుమారు 59 లక్షల చదరపు అడుగుల వరకు వస్తుంది. ఇందులో తమకు 2.5 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) నిర్మాణ స్థలం ఇవ్వాలని ఆయన డీల్ మాట్లాడుకున్నట్టు సమాచారం. ఈ భూములు అసలే ఐటీ కారిడార్‌లో ఉండటంతో వాటికి బహిరంగ మార్కెట్లో భారీ డిమాండ్ ఉన్నది. ఆ ప్రకారం ఆ అమాత్యుడు కుదుర్చుకున్న ఒప్పందంలోని 2.5 లక్షల చదరపు అడుగులు అంటే బహిరంగ మార్కెట్‌లో దాని విలువ సుమారు రూ.250 కోట్ల నుంచి 300 కోట్ల వరకు ఉంటుందని అంచనా. సదరు నిర్మాణ సంస్థకు, అమాత్యుడికి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు తదనంతరం రెవెన్యూ రికార్డుల్లోని నిషేధిత జాబితా నుంచి ఆ 27.18 ఎకరాల విస్తీర్ణాన్ని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు సమాచారం. ఆ తర్వాత నిర్మాణ సంస్థ గతంలో చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించడంతో ఇందుకు మార్గం సుగమమైంది. గత ఏడెనిమిది నెలలుగా ఆ భూముల్లో నిర్మాణ సంస్థ పెద్దఎత్తున పనులు జరుపుతున్నది.

అనిరుధ్ వర్సెస్ హైడ్రా... కారణమేందో?

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రెండు రోజుల కిందట అసెంబ్లీలో మీడియా చిట్‌చాట్‌లో ఈ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. ఇదో పెద్ద స్కాంగా ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా తాను హైడ్రాకు ఫిర్యాదు చేసినా కనీసం రసీదు ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై హైడ్రా కూడా వివరణ ఇచ్చింది. ఖాజాగూడ తౌతోనికుంట, భగీరథమ్మ చెరువులపై హైడ్రాకు ఫిర్యాదు అందినట్టుగా పేర్కొన్నది. కొత్తకుంటలో వంశీరాం బిల్డర్ నిర్మాణాలు చేపడుతున్నట్టుగా ఫిర్యాదులు అందినట్టు తెలిపింది. ఇదే విషయమై హైకోర్టు నుంచి కూడా హైడ్రాకు సూచనలు వచ్చాయని, హైకోర్టు ఆదేశాలతోపాటు స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఓక్రిడ్జ్ స్కూల్‌కి ఎదురుగా ఉన్న కొత్తకుంటపై విచారణ చేపట్టామని వెల్లడించింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని తెలిపింది. కొత్తకుంటలోకి వర్షం నీరు రాకుండా అడ్డుగా పనివాళ్ల కోసం నిర్మించిన షెడ్లను తొలగించామని, వంశీరాం బిల్డర్స్ మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నది. దీంతో అసలు ఫిర్యాదు చేయకుండానే అనిరుధ్‌రెడ్డి సదరు నిర్మాణ సంస్థను, హైడ్రాను టార్గెట్ చేశారా? లేక ఫిర్యాదు అందినా హైడ్రా దాచిపెడుతున్నదా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఈ భూములపై రెవెన్యూ శాఖకు ఫిర్యాదులు అందినప్పటికీ ఎటూ తేల్చకుండా చాలాకాలంగా నాన్చుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొసమెరుపు ఏమిటంటే..!

ఖాజాగూడలోని 27.18 ఎకరాలు గత ప్రభుత్వ హయాంలో చేతులు మారినట్టు అనిరుధ్ చెప్తున్నారు. ఆయన తెలిసి అన్నడో, తెలియక అన్నడో.. లేక ఇంకెవరైనా అలా ఆయనతో చెప్పించి ఉండవచ్చో తెలియదు కానీ అన్యాక్రాంతం కాకుండా ఆ భూమిని కాపాడిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. సీసీఎల్ఏ ఉన్నతాధికారితో విచారణ జరిపించి ప్రభుత్వ భూమిగా ప్రకటించింది. అందులోని ఆక్రమణలను తొలిగించింది. ఎక్కడా చేతులు మారకుండా ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చింది. క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా రిజిస్ట్రేషన్ల శాఖను అప్రమత్తం చేసింది. అనుమతులివ్వకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీలకు ఆదేశాలిచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ డీనోటిఫై ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫలితంగా 27.18 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. అనిరుధ్‌రెడ్డికి ఈ విషయం తెలుసో లేదో! ఆయనకు ఇన్‌పుట్ ఇచ్చిన వారైనా ఈ సమాచారం ఇచ్చారో, లేదో!

సర్కారు దగ్గర సమాధానముందా?

ఒక నిర్మాణ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా రూ.వేల కోట్ల ప్రాజెక్టును చేపడుతుందంటూ అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపించడం రియల్-నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపే పరిణామం. ముఖ్యంగా తాను హైడ్రాకు ఫిర్యాదు చేసినా స్పందించలేదనే కీలకమైన విమర్శ కూడా ఎమ్మెల్యే నుంచి వినిపిస్తున్నది. అయితే ఆ ఎమ్మెల్యే తమకు ఫిర్యాదే చేయలేదని హైడ్రా అధికారికంగా ప్రకటించింది. మరి వీటిలో ఎవరిది నిజం?! గతంలో అనుమతులు ఉన్నా హైడ్రా బుల్డోజర్లతో నేలకొరిగిన సామాన్యుల నిర్మాణాలెన్నో మన కండ్లముందే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే అక్కడ వంశీరాం బిల్డర్స్ తన నిర్మాణ కార్యకలాపాలను ప్రారంభించిందనేది ఆలోచించాల్సిన విషయం. ఎమ్మెల్యే ఆరోపణలే నిజమైతే... ఆ ప్రాజెక్టులో ఫ్లాట్లను కొనుగోలు చేసే సామాన్యుల పరిస్థితి ఏమిటి? అసలు గుట్టు తేల్చేది ఎవరు? గతంలోనూ సాక్షాత్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకంగా సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మరీ.. రూ.15వేల కోట్ల విలువైన పదకొండు నిర్మాణ ప్రాజెక్టులు అక్రమమని తీర్పునిచ్చారు. ఆయా ప్రాజెక్టుల్లో బ్యాంకు రుణాలు తెచ్చి రూ.కోట్లకు కొనుగోలు చేసిన సామాన్యులకు కంటి మీద కనుకులేకుండా పోయింది. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి టార్గెట్ చేసిన వంశీరాం బిల్డర్స్ ప్రాజెక్టులో నిర్మాణ విస్తీర్ణం ఒకటీ అరా కాదు! సుమారు 59 లక్షల చదరపు అడుగులు!! అనిరుధ్‌రెడ్డి చెప్తున్నట్టు ఇది స్కామే అయితే తదుపరి వందలాది మంది అమాయకుల భవిష్యత్తు ఏమిటనే ప్రశ్నకు సమాధానమివ్వాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే!

రద్దు చేయించిన గత సర్కారు పెద్దలు

రంగారెడి జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి ఏకంగా 27.18 ఎకరాల ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టిన సమాచారం అప్పట్లోనే ప్రభుత్వ పెద్దలకు చేరింది. అప్రమత్తమైన కేసీఆర్ ప్రభుత్వం సీసీఎల్ఏ ఉన్నతాధికారి ఒకరిని రంగంలోకి దింపింది. సర్కారీ భూమిని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సీసీఎల్ఏ ఉన్నతాధికారి 2022లో జిల్లా ఉన్నతాధికారి డీనోటిఫై (నిషేధిత జాబితా నుంచి తొలగించిన) చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఇచ్చిన ఉత్తర్వుల్లో (ఎస్ఈటీటీ-2/211/2023, తేది: 5.8.2023) వాటిని సమగ్రంగా పేర్కొన్నారు.

- జిల్లా ఉన్నతాధికారి 2022లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేశారు. తద్వారా 27.18 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగానే ఉంటుందని ప్రకటించారు.
- ఆ నిషేధిత భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని, గృహ, వాణిజ్య సముదాయాలు నిర్మించవద్దని పేర్కొన్నారు.
- ఈ భూములకు సంబంధించి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులేవీ ఇవ్వద్దని, ఒకవేళ ఇచ్చినా అవి చెల్లవని స్పష్టం చేశారు.
- ఈ భూముల్లోని ప్లాట్లకు క్రయ, విక్రయాలను జరుపవద్దంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించారు.
- క్షేత్రస్థాయిలో సదరు నిర్మాణ సంస్థ భూమిలో వేసిన రేకుల షెడ్లు, ఇతర సామగ్రిని తొలగించి, ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులే రంగంలోకి దిగడంతో సంస్థ నిర్వాహకులు కూడా ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి.

లోకం పోకడ

అన్నీ సీఎం గారే చెప్పాలంటే ఎలాగయ్యా?
ఆయన ప్రతిపక్ష నేతను బూతులు తిట్టే పనిలో బిజీగా ఉన్నారు.
మీరు ఆయన్ని తిట్టేవాళ్లను అరెస్టు చేసే పనిలో ఉండండి!

బీజేపీతో రేవంత్ డీల్ సెట్

త్వరలో ఊడిపోయే సీఎం పదవిని కాపాడుకోవడానికి బీజేపీ నేతలతో రహస్య భేటీ

పదవుల కోసం ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే నీచ చరిత్ర కాంగ్రెస్ నాయకులది

సీఎంపై చర్య తీసుకునే దమ్ము రాహుల్‌కు ఉన్నదా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): త్వరలో ఊడిపోయే ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడానికి బీజేపీ నేతలతో రేవంత్‌రెడ్డి రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. అట్టర్‌ఫ్లాప్ ముఖ్యమంత్రిగా ముద్రపడి, ఏ క్షణంలోనైనా తన సీఎం కుర్చీ చేజారే సూచనలు కనిపించడంతోనే బీజేపీతో రేవంత్ డీల్‌సెట్ చేసుకుంటున్నట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ బీజేపీ నేతలతో సీక్రెట్ మీటింగ్‌లు పెట్టుకోవడం దగుల్బాజీ రాజకీయమని విమర్శించారు. ఇలాంటి దిక్కుమాలిన చిల్లర రాజకీయాన్ని తెలంగాణ గడ్డపై ఎప్పుడూ చూడలేదని ఎక్స్ వేదిగా ధ్వజమెత్తారు. ఏదో గూడుపుఠాణి చేసి తెలంగాణను ఆగం చేయడానికే ఈ తెరచాటు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తమ పదవులు కాపాడుకోవడానికి ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే నీచ చరిత్ర కాంగ్రెస్ నాయకులకు ఉన్నదని దుయ్యబట్టారు.

సీఎంపై చర్య తీసుకునే దమ్ము రాహుల్‌కు ఉన్నదా?

కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారంటున్న రాహుల్‌గాంధీకి తమ పార్టీ ముఖ్యమంత్రి బీజేపీతో చేసుకుంటున్న చీకటి ఒప్పందాలపై స్పందించే దమ్మున్నదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్‌రెడ్డిపై చర్య తీసుకునే ధైర్యం రాహుల్‌గాంధీకి ఉన్నదా? అని నిలదీశారు. ఒకవైపు బీజేపీ నేతలతో కుస్తీపడుతున్నట్టు బయట ఫోజులు కొడుతూ, దొంగచాటుగా దోస్తీ చేయడమే కాంగ్రెస్ సంస్కృతా? అని ప్రశ్నించారు.

రేవంత్ డర్టీ పాలిటిక్స్

పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ఒక్క సమీక్షా సమావేశమైనా నిర్వహించే సమయంలేని సీఎంకు, ఈ రహస్య భేటీలకు మాత్రం టైం దొరకడం క్షమించలేని ద్రోహం అని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ, ఈ చీకటి మీటింగ్‌లు ఏమిటని ప్రశ్నించారు. ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని ఆగంచేసి డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లో సహించదని, కర్రు కాల్చి వాత పెట్టడని హెచ్చరించారు.

గాలి మాటలు.. గబ్బుకూతలు

సీఎం రేవంత్‌రెడ్డివి గాలి మాటలు.. గబ్బుకూతలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గల్లీలో హోదాను మరచి తిట్లు, ఢిల్లీలో చిట్‌చాట్‌లు అంటూ ఆయన రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. నీళ్లు లేక పంటలు ఎండి, పొలాలు బీడువారి అన్నదాతలు అరిగోస పడుతుంటే సాగునీటిపై సమీక్ష లేకుండా ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. 39సార్లు ఢిల్లీ పోయి మీడియా ముందు సెల్ఫ్ డబ్బా కొట్టుకునుడు తప్ప, సాధించిన పని, తెచ్చిన రూపాయి లేదని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ, రేవంత్ మధ్య సంబంధాలుంటే ఏంటి, ఊడితే ఏంటి? దానివల్ల తెలంగాణకు ఒరిగేదేమిటి? అని ప్రశ్నించారు.

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

Format C-2

(For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI**
*Name of Election : **BIENNIAL ELECTION TO TELANGANA LEGISLATIVE COUNCIL-2025**
Name of State/~~UT~~ : **TELANGANA**

1	2	3	4		5		
Sl. No.	Name of Constituency	Name of candidate	(A)Pending criminal cases		B) Details about cases of conviction for criminal offences		
			Name of Court, case No. & Status of the cases(s)	Sections of the Acts concerned & brief description of offence(s)	Name of Court & date(s) of orders(s)	Description of offence(s) & Punishment imposed	Maximum Punishment Imposed
1.	**BY THE MEMBERS OF LEGISLATIVE ASSEMBLY (MLAs)**	**Dr. DASOJU SRAVAN KUMAR.**	XVth ACMM Criminal Court Complex at Nampally CC.No.10404 of 2023 FIR NO. 304 of 2023 at Shainayath gunj Police Station	Sec.188 of IPC This is a Suo Motu Police case alleging that I was found along with the contesting candidate on 29th November 2023 at about 19.00 Hours at Sriram Colony, Begum Bazar, Hyderabad in violation of Model Code of Conduct during General Eelections-2023, Telangana.	-NA-	-NA-	-NA-

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/-
SOMA BHARAT KUMAR
GENERAL SECRETARY
Bharat Rashtra Samithi

హోలీ సందర్భంగా హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న హైదర్షాకోట్ డ్రీమ్‌హోమ్ కాలనీ వాసులు. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు సునీతాలక్ష్మారెడ్డి, కార్తీక్‌రెడ్డి

హరీశ్‌రావుకు హోలీ శుభాకాంక్షలు

ఆపదలో అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపిన హైడ్రా బాధితులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/బండ్లగూడ: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైడ్రా బాధితులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదర్‌షాకోట్ డ్రీమ్ హోమ్ కాలనీవాసులు హరీశ్‌రావు ఇంటికి వచ్చి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. హైడ్రా కూల్చివేతలతో కన్నీరుమున్నీరైన తమకు హరీశ్‌రావు ధైర్యం చెప్పి భరోసా నింపారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆపదలో ఉన్న తమకు మానవతాదృక్పథంతో ఆయన చేసిన సాయాన్ని ఎప్పటికీ మరిచిపోమన్నారు. ప్రజాసమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఆయన మాలాంటి ఎందరికో ఆరాధ్యుడని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఎళ్లప్పుడూ ముందుండే ఆయనకు ఈ పండుగ వేళ మరింత సేవచేసే శక్తి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం హరీశ్‌రావు వారికి హోలీ శుభాకాంక్షలు చెప్పారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి ఉన్నారు.

జనగామకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలి!

- జనగామలో ఈ నెల 21న గౌడ సంఘాలతో దీక్ష
- పోస్టర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ‘నీరా కార్పొరేషన్’ను తీసుకురావాలని డిమాండ్

నెక్లెస్‌రోడ్‌లోని నీరాకేఫ్‌లో చలో జనగామ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో గౌడసంఘాల నాయకులు నారాయణగౌడ్, సదానందంగౌడ్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 21న జనగామలో భారీ నిరసనదీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నెక్లెస్‌రోడ్‌లోని నీరాకేఫ్‌లో ‘చలో జనగామ’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలని గీతకార్మిక, గౌడ సంఘాలు తీర్మానించి, ఆందోళనలు చేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 21న దీక్ష తర్వాత ఉద్యమ కార్యచరణ ప్రారంభమవుతుందని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, నందనం నీరా ప్రాజెక్టును ప్రారంభించాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని, కార్మికులకు సేఫ్టీ మోకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో గౌడ్‌లకు 25శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో నీరా కేఫ్‌లను తీసుకురావడంతో పాటు ‘నీరా కార్పొరేషన్’ ఏర్పాటు చేసి గీత కార్మికులను ఆదుకోవాలని కోరారు. దీక్షను విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. గౌడన్నలందరూ ‘చలో జనగామ’కు తరలిరావాలని సమన్వయ కమిటీ సభాధ్యక్షుడు సదానందంగౌడ్ తెలిపారు. సమావేశంలో గౌడ, కల్లుగీత సంఘాల నాయకులు ఏడుకొండలుగౌడ్, ఈశ్వరయ్యగౌడ్, సోమన్నగౌడ్, కృష్ణగౌడ్, మురారీగౌడ్, మల్లేశం గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మహేందర్‌గౌడ్, భూపతిగౌడ్, ఆంజనేయులుగౌడ్, రాజకుమార్‌గౌడ్, సత్యంగౌడ్, సిద్ధిరాములుగౌడ్, వెంకటనర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న ఎండ

పలు జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



హైదరాబాద్, మార్చి 14 (నమస్తేతెలంగాణ): రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శుక్రవారం నిర్మల్ జిల్లా లింగాపూర్‌లో అత్యధికంగా 40.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 40.6, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు, నిజామాబాద్ జిల్లాల్లో 40.4, జగిత్యాల, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో 40.3, జయశంకర్ భూపాలపల్లిలో 40.2, కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో 40.1 డిగ్రీలు, మంచిర్యాలలో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 38.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న మూడు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశమున్నదని తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు తీవ్ర వడగాలులు వీచే అవకాశమున్న నేపథ్యంలో ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నది.